క్లుప్తంగా

విద్యుత్ స్తంభం పునరుద్ధరించక ఇబ్బందులు



నీలకంఠాపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం గ్రామ శివారులో నేలకూలిన విద్యుత్‌స్తంభం పునరుద్ధరించి వీధిలైటు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ శివారులో రాత్రి చీకట్లో బయటకు వెళ్లడానికి వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారని తెలియ జేశారు. ఇటీవల కురిసిన వర్షాలు ఈదురుగాలులకు నేల కొరిగిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని నేలకొరిగిన స్తంభం స్థానంలో కూతనంగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే



బలిజిపేట అంగన్వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్న అధికారులు

బలిజిపేట: అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వేను నిర్వహించినట్లు ఎంఈఓ–2ౖౖ.శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా బలిజిపేట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సర్వేను నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉండే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి దివ్యాంగ చిన్నారుల గుర్తింపు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికి 11మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని పాఠశాలల్లో చేర్పినట్లు ఐఈఆర్‌పీ రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీరు మళ్లించడానికి దారేదీ?



బోరు కంచంలో నిలిచిపోయిన వృథానీరు

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి బోర్ల వద్ద చెత్త పేరుకు పోవడంతో నీరుకోసం వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. తాగునీటి కొరత తీర్చడానికి క్రాస్ ప్రోగ్రాం ద్వారా బోర్ల మరమ్మతులు చేయడంతో నీరు పుష్కలంగా అందుతోంది. అయితే బోర్ల వద్ద వృథానీరు మళ్లించడానికి దారిలేక పోవడం, చుట్టు పక్కల వారు చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్ల చుట్టూ కంచాలు కట్టినా వృథానీరు మళ్లించక పోవడంతో నీరు రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నందున నీటి కోసం వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆరోపిస్తున్నారు. తక్షణమే బోర్ల వద్ద వృథానీరు మళ్లించడానికి కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు



గర్భిణుల ఆరోగ్యం గురించి ఆరాతీస్తున్న వైద్యురాలు సాయిప్రసన్న

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గెడ్డితిరువాడ ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆస్పత్రికి వచ్చిన ప్రతి గర్భిణి ఆరోగ్యం పరీక్షించి, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: మండల పరిధిలోని శంభాం, ముత్యాలు, ఓంధ్రుజోల, మల్లి ఆశ్రమ పాఠశాలలు సహా సీవోఈ కళాశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ సోమవారం చేపట్టారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యాసంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ఆహ్లాదకర వాతావరణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి పి.వి.సత్యనారాయణ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు పాల్గొన్నారు.

వెద సాగులో లాభాలు

- వరిసాగులో అధిక దిగుబడి
- పెట్టుబడి ఖర్చు ఆదా



సాగుకు సిద్ధమైన భూమి

బలిజిపేట: వరిసాగులో వెదజల్లు విధానంతో ఎన్నో లాభాలు ఉన్నాయి. తక్కువ సాగునీటితో అధిక దిగుబడి సాధించాలన్నా, కూలీలు, ఎరువులు, పురుగుమందుల సమస్యను అధిగమించాలన్నా ఈ పద్ధతే మేలైనది. రైతులు ఈవిధానం అనుసరిస్తే బాగుంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. నారుతీత, నాట్లు ఖర్చు ఉండకపోగా విత్తనాలు, కూలీల ఖర్చు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఎకరాకు రూ.10వేల వరకూ పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. సాధారణ విధానం కన్నా ఈ విధానంలో ఎకరాకు ఐదారు బస్తాల దిగుబడి సైతం ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. వెదజల్లు పద్ధతిలో వరిసాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

సాగువిధానం ఇలా:

వేసవి దుక్కి చేసిన పొలంలో ఎదిగిన గడ్డి, పిచ్చిమెక్కలను దమ్ములో కలియదున్ని వారం రోజులు ఉంచితే పొలం సారవంతమవుతుంది. ఇలా దుక్కి చేసిన పొలాన్ని సమాంతరంగా తయారుచేసి నాటడానికి 24గంటల ముందు వరి విత్తనాలు నానబెట్టి చిన్నగా మొలకెత్తిన తరువాత ప్రతి రెండు మీటర్లకు కాలిబాట ఉండే విధంగా విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలు దూరంగా నాటడం వల్ల గాలి, వెలుతురు అధికంగా ఉండి విత్తనాలు చల్లిన 15రోజుల తరువాత పంట ఆశాజనకంగా ఎదుగుతుంది. అయితే పంటతో పాటు కలుపు మొక్కలు కూడా సమాంతరంగా ఎదిగే అవకాశం ఉంటుంది.

కలుపు నివారణ

విత్తనం వేసిన తరువాత రోజే పొలంలో కలుపు మందు పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన మూడు రోజుల తరువాత కలుపుమందును మరోసారి స్ప్రే చేసుకోవాలి. వారం తరువాత వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో కలుపుమందును వాడుకోవాలి. విత్తనాలు చల్లిన 15నుంచి 20రోజుల తరువాత ఇంకోసారి కలుపు నివారణకు ఎకరాకు 80నుంచి 100గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్‌ఇథైల్ పిచికారీ చేయడం, ఎకరాకు 30–35గ్రాములు ఆక్సాడియార్జిల్ 20కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవడం ద్వారా కలుపును పూర్తిగా నివారించవచ్చు.



విత్తనాల బస్తాలు

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి:

ఎకరాకు 20నుంచి 30కేజీల విత్తనాలు చల్లితే సరిపోతుంది. ఈ విధానంలో నారుమడి తయారీ, నారుతీత, నాట్లు వేసే ఖర్చు ఉండదు. కాలిబాటలు ఉండే విధంగా విత్తనాలు చల్లడం వల్ల గాలి, వెలుతురు మెండుగా ఉండి పంట భారీగా ఎదిగి ఎకరాకు ఐదారు బస్తాల వరకూ అధిక దిగుబడి వస్తుంది. ఈ విధానంలో వ్యవసాయాధికారుల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులు వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

> **కలుపునివారణపై దృష్టిసారించాలి**
>
> వెదజల్లు పంట విధానంలో కలుపు నివారణే ముఖ్యం. కలుపు నివారణ ప్రారంభ దశలో తీసుకుంటే పంట బాగుంటుంది. ఈ పద్ధతిలో ఖర్చులు తక్కువగా ఉంటాయి. రానున్న రబీ సీజన్‌కు అనుకూలంగా ఉంటుంది.
>
> శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: క్షేత్రస్థాయిలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ యోగాతోనే సాధ్యమని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అప్పయ్యపేటలో సోమవారం యోగాసనాలు, యోగా వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణారోగ్యవంతంగా ఉండాలంటే యోగాసనాలతో అది సాధ్యమని గుర్తించేలా అవగాహన సదస్సులు, ర్యాలీలు, యోగాసన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే మండల, క్లస్టర్ స్థాయిలో యోగాసనాలపై శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. అలాగే తాజాగా గ్రామాల్లో క్లస్టర్ ట్రైనర్స్‌తో యోగాసనాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు శిక్షణ ఇవ్వడం, యోగాసనాలు వేయిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికార సిబ్బంది అప్పలనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరే తాగాలా..?



కుళాయి ద్వారా వస్తున్న మురుగునీటిని బాటిల్‌లో పట్టి చూపిస్తున్న చినదేవర వీధి మహిళలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని 28వ వార్డు పరిధిలో ఉన్న చినదేవర వీధిలో సోమవారం సాయంత్రం కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయగా కుళాయిల్లో నుంచి నల్లని మురుగునీరు రావడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. తాగేందుకు నీరు పడితే కాలువల్లో ఉన్న మురుగు నీరు వస్తోందని వాపోయారు. ఇలాంటి నీటిని తాగితే తమ ఆరోగ్యాలు ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తక్షణమే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి పరిష్కరించాలని, లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జనసేన నాయకుడు ఆర్.రాంబాబు తెలిపారు. అలాగే మురుగునీరు సరఫరా కావడంతో ఆ నీటిని బాటిల్‌లో వేసి స్థానిక మహిళలు చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి.

వివరాలు సేకరించాలి

- మండల ప్రత్యేకాధికారి సుధారాణి



మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింఛన్లు, హౌసింగ్ బిల్లులు, ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా తదితర ప్రభుత్వ పరమైన స్కీమ్‌లకు సంబంధించిన వివరాలను సేకరించి వాటిలోని లోపాలను కూడా గుర్తించి నివేదిక అందించాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి సుధారాణి పేర్కొన్నారు.

ఈ మేరకు సోమవారం విజన్ 2047 కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల్లో చురుగ్గా పనిచేస్తున్న ఐదుగురు అధికారులను ఈ వివరాలు సేకరించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారు ప్రభుత్వ పరమైన స్కీమ్‌లకు సంబంధించిన వివరాలు సేకరించి వాటిలోని లోపాలను గుర్తించి నివేదిక అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, ఏపీఎం సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో తోటల ధ్వంసం



కోటసీతారాంపురంలో మామిడి మొక్కతోటలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలో కంటికిరెప్పలా పెంచుకుంటున్న మొక్కమామిడి తోటలను ఏనుగులగుంపు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లక్ష్మీపురం, ఏగోటివవలస గ్రామాల సమీపంలో సువర్ణముఖినది ఒడ్డున ఉన్న ఏనుగుల గుంపు సోమవారం కోట సీతారాంపురం– పూనుబుచ్చింపేట గ్రామాల మధ్య మొక్కమామిడి తోటలో సంచరిస్తున్నాయి. ఏనుగులగుంపు రావడంతో ప్రజలు తిలకించ డానికి వెళ్లారు. అప్పటికే మొక్కతోటగా ఉన్న మామిడి చెట్ల జెడ్లను ఏనుగులు ధ్వంసం చేయడంతో ట్రాకర్స్ కొంత మేర నివారించగలిగారు. ప్రస్తుతం పూనుబుచ్చింపేట, జానుమల్లువలస, కోట సీతారాంపురం గ్రామాల మధ్య సంచరిస్తున్న ఏనుగుల గుంపు రాత్రికి ఎటు పయనిస్తుందోననే ఆందోళనలో ఉన్నారు. కోటసీతారాంపురంలో ఏనుగులున్న కారణంగా ఆయా గ్రామాల ప్రజలు బయటకు వెళ్లాల్సిన వారు జాగ్రత్తలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల ధాన్యం ధ్వంసం



ధాన్యం బస్తాలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు

ఖరీఫ్ సీజన్‌కు మండల రైతు రెడ్డి అప్పారావు తన కళ్లంలో భద్రపర్చుకున్న విత్తనాలు, ఇంటి అవసరాలకు సరిపడ ధాన్యాన్ని ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో ఆందోళన చెందుతున్నాడు. ఇంటికి సరిపడ ధాన్యంతో పాటు 10 బస్తాల విత్తనాలను తినేసి బస్తాలన్నిటినీ చిందర వందర చేశాయని వాపోతున్నాడు. ఈ మేరకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతు బీట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో అటవీశాఖ బీట్ ఆఫీసర్ నష్టం వాటిల్లిన ధాన్యం బస్తాలను పరిశీలించి నష్టం అంచనా వేశారు.

ఎండీయూ వాహనాలతో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి



వాహనాల ద్వారా రేషన్ సరుకులు ఇంటింటికి అందించాలని కోరుతూ డీటీ భానుప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సాలూరు:

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని గిరిజన సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి గమ్మెల జానకిరావు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం ఇంటింటికి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీచేసిందన్నారు. కానీ నేడు ఆ వాహనాలను రద్దు చేసి రేషన్ డిపోల ద్వారా సరుకులు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ కారణంగా వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని వాపోయారు. కావున ప్రభుత్వం స్పందించి గతంలో పంపిణీ చేసిన విధంగా వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొమరాడ: మండలంలోని స్వామినాయుడు, గంగారేగువలస, గుంప, కోటిపాం, గుమడ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులంతా ఊరూరా వాహనం ద్వారా వెళ్లి, త్రైత సిద్ధాంతం గూర్చి ప్రజలకు తెలియజేశారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మల గూర్చి తెలుసుకోవడమే సిద్ధాంతమన్నారు. భగవద్గీతలో కర్మ, బ్రహ్మ, భక్తి యోగాలనుసారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడి మనిషికి ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటరావు, కల్యాణి మేఘన, శంకరరావు, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

సీతంపేట: డీఏ జుగా సర్వేను వేగవంతం చేయాలని ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన.. విద్య, జీవనోపాధిలో కీలకాంతరాలను పరిష్కరించడం ద్వారా గిరిజన వర్గాల అభివృద్ధికి భారత ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మిశ్రో, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగి విద్యార్థులకు 'షైనింగ్ స్టార్'

జియ్యమ్మవలస రూరల్: షైనింగ్ స్టార్ అవార్డులకు మండలంలోని చినమేరంగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పెళ్లూరు వర్ష, బార్లంకి పౌర్ణమి, మజ్జి రాబిన్‌లు ఎంపికై అవార్డులు అందుకున్నారు. ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేయగా, వారిని ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది అంతా అభినందించారు. వారు ఈ పురస్కారాలను జిల్లా కేంద్రంలో అందుకున్నట్లు సమాచారం.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

- యూనియన్ నాయకుల డిమాండ్



సమ్మె నోటీసును అందిస్తున్న యూనియన్ నాయకులు తదితరులు

సాలూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. తమ జీతాలు పెంచాలని కోరుతూ జూన్ 6 వతేదీ నుంచి 14 రోజుల తరువాత ఏ రోజునుంచైనా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ డీఈ ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ,యూనియన్ నాయకులు అమర్‌కుమార్,దుర్గ తదితరులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో ఇంజినీరింగ్ సెక్షన్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 12 వేల మంది కార్మికులు తమ పని నైపుణ్యానికి తగిన జీతాలు అందకపోవడంతో నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో కుటుంబాలు గడవక అర్థాకలితో బతుకుతున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె నోటీసు అందించిన నాటి నుంచి 14 రోజుల తర్వాత ఏరోజు నుంచైనా సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరరావు, రఘు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ ఆందోళన

పార్వతీపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లు గంగునాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యమ్మల మన్మథరావులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్లకు అప్పగిస్తే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ప్రైవేటీకరణలో భాగంగా ఇప్పటికే ప్లాంట్‌లో పనిచేస్తున్న నాలుగు వేలు మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మిగిలిన వారిని కూడా తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణ, జీవీ రమణ, సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఆర్.ఈశ్వరరావు, తులసి, శ్రీదేవి, రాము, అఖిల్, సాయి శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి



పట్టణ పోలీసు స్టేషన్ వీధిలో ఇలా..



మున్సిపాల్టీలోని 14వ వార్డులో చెత్త పక్కన సేదతీరుతున్న పందులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని ఉన్న మున్సిపాల్టీ వార్డుల్లో చెత్తను తరలించకపోవడంతో నిల్వలు పెరిగి దుర్వాసన వెదజల్లుతూ కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తూ పందులకు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. జనవాసాలకు సమీపంలో ఇలాంటి దుస్థితి ఏర్పడడంతో స్థానికులు వ్యాధుల బారిన పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్త నిలవ్వలను ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బంది తరలించాల్సింది పోయి రోజుల తరబడి ఇలా నిల్వలుగా ఏర్పాటు చేయడం సమంజసం కాదని, వారి తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి



గర్భిణులకు సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

- బందలుప్పి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం రూరల్:

గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని బందలుప్పి పీహెచ్‌సీ వైద్యుడు డా.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహించి గర్భిణులకు అందజేస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే ప్రిజం 10 గురించి అవగాహన కల్పించారు. మాతా శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్యపరీక్షల వివరాలు పరిశీలించి హెచ్చుతగ్గులు గుర్తించి గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వారిలో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే వైద్యులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా నీరు వంటి ద్రవరూప ఆహారాన్ని గర్భిణులు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.